క్లుప్తంగా

4న మాజీ సైనికుల సమావేశం

కడప రూరల్ : డిసెంబర్ 4వ తేదీన నిర్వహించే మాజీ సైనిక సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరు కావాలని ది కడప డిస్ట్రిక్ట్ ఎక్స్-సర్వీస్ మెన్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ తెలిపారు. కడప సైనిక్ నగర్‌లో ఇంటి స్థలం పొంది ఎలాంటి నిర్మాణాలు చేపట్టని వారు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు, ఇంత వరకు ఇంటి స్థలాలు పొందని వారు, కొత్తగా సొసైటీలో సభ్యత్వం తీసుకొనదలచిన వారు సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ సమావేశం కడప సైనిక్ నగర్‌లో 4వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ కృతజ్ఞతలు

వైవీయూ : ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు ప్రక్రియను మూడు సంవత్సరాల నుంచి 8 సంవత్సరాలకు పెంపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జీఓ 90ను విడుదల చేయడం ద్వారా 4 వేల పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అదే విధంగా రెన్యువల్ రికగ్నేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్సీలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాస శ్రవణా నక్షత్ర పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అలాగే మనోజిరావు వీధిలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా సందర్భంగా స్వామి, అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రవణా నక్షత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లి : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమానికి మ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాక్యానుసారం ఎదగాలి

కమలాపురం : మీ ప్రేమ, ఆప్యాయత, అనురాగం మరువలేనిదని, ప్రతి ఒక్కరు వాక్యానుసారం ఎదగాలని ఎర్రగుంట్ల ఐసీఎస్ సీఎస్ఐ చర్చి ఫాస్టర్ జోసఫ్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చి ఫాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించడం హర్షణీయం అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రేమ విందులో సంఘ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లైమ్‌లను విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : భవన నిర్మాన కార్మికుల పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం కుదేలవడంతో ఉపాధి లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ఏరియా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి యేసోబ్, నాయకులు సుబ్బరాయుడు, కుమార్, వెంకరటమణ, సురేంద్ర, ఓబులేసు, శ్రీనివాసులు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు ఆలయాలు సిద్ధం



కార్తీక మాస విశేష అలంకారంలో శ్రీ ప్రసన్న విశ్వేశ్వరుడు



మృత్యుంజయకుంట శివాలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

కడప కల్చరల్ : కార్తీక మాసంలో అత్యంత పుణ్యప్రదంగా భావించే కార్తీక సోమవార పూజలకు జిల్లా అంతటా దేవాలయాలు సిద్ధమయ్యాయి. దీపావళి మరుసటిరోజు మధ్యాహ్నం కార్తీకమాసం ప్రారంభమైంది. కానీ కార్తీక మాసం తొలి సోమవారం ప్రభాత సమయంలో దీపాలు వెలిగించలేకపోయామన్న అసంతృప్తి భక్తుల్లో ఉంది. అలాంటి వారంతా ఈ సోమవారం తమ మొక్కులు తీర్చుకునేందుకు దీపాలు వెలిగించాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రముఖ శివాలయాలన్నీ భక్తులు దీపాలు వెలిగించుకునేందుకు తగిన స్థల వసతితోపాటు ఇతర సౌకర్యాలను కూడా కల్పించారు. దేవదాయశాఖ పరిధిలోని శివాలయాలలో ఆయా ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, కార్తీక దీపోత్సవాల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేశారు. పలు ప్రైవేటు శైవ ఆలయాలలో కూడా స్థాయికి తగినట్లు భక్తులు దీపాలు వెలిగించేందుకు ఆలయ కమిటీ చైర్మన్లు, ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేశారు. కడప నగరంలోని పది శివాలయాలలో కార్తీక దీపారాధనకు భక్తులు సిద్ధమయ్యారు.

మన గుడిలో భాగంగా..

తిరుమల-తిరుపతి దేవస్థానాలు మన గుడి కార్యక్రమంలో భాగంగా కార్తీక మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఎంపిక చేసుకున్న శివాలయాలలో దీపాలకు అవసరమైన సామగ్రిని నిర్వాహకులే అందజేస్తూ భక్తులు దీపాలు వెలిగించేందుకు సహకరిస్తున్నారు. ప్రమిదలు, నూనె, వత్తులను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీని నిరోధించేందుకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల వెలుపల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకోనున్నారు. దేవాలయాలలో ఈ మాసమంతా తెల్లవారుజామునే శివయ్యకు విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరంలో పలు చోట్ల భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. సాయంత్రాలు భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



కళాశాలలో అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని కళాశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించడంలో భాగంగా ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీం బాషా మాట్లాడుతూ చరిత్ర కలిగిన కళాశాలలో చదివిన విద్యార్థినులు అందరూ కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కళాశాల పూర్వ విద్యార్థులు, ఉన్నత విద్య పూర్వపు ప్రాంతీయ సంచాలకులు పి. పద్మావతి, వైవీయూ వాణిజ్యశాస్త్ర ఆచార్యులు విజయభారతి, కళాశాల సీపీడీసీ సభ్యురాలు, కమలాపురం ఎంఎల్ఏ పి.రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి పి.అరుణకుమారిలు అతిథులుగా విచ్చేసి కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. న్యాక్ ఏ గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రస్తాను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్ : కడప నగరం సాయిపేటలోని ఏ-1 నగర్‌లో మసీద్-ఏ-గఫారియా మసీదు వెనుక భాగంలో ఉన్న రస్తాను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు మహమ్మద్ ఇబ్రహీం, నిస్సార్, ఫరీద్ కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానికంగా నివసిస్తున్న ఒక వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టిస్తూ స్థలాలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మసీదుకు ముందు ఒక స్థలం ఉంటే దాన్ని ఒకరికి విక్రయించారని అన్నారు. అలాగే ఇక్కడ ఉన్న ఒక దారి స్థలాన్ని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. కాగా మసీదుకు వెనుక వైపున రస్తా ఉందన్నారు. ఈ రస్తాకు కూడా ఒక దొంగ పత్రాన్ని సృష్టించి కబ్జా చేశారన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆ అధికారులు కూడా అది రస్తా స్థలమని నిర్ధారించారని అన్నారు. అయినప్పటికీ ఆ వ్యక్తి ఆ స్థలం నాదే నంటూ తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. అధికారులు ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో చాలా మందికి రస్తా లేకుండా పోతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు ఎం.సుబ్రమణ్యం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. తొలుత మహాగణపతిపూజ, పుణ్యాహ వాచనం, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, 108 శంఖాలలోని తీర్థంతో అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. కల్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం సందడిగా సాగింది. రాత్రి కల్యాణ మూర్తులను మయూర వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా

వైవీయూ : పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ ద్వితీయ జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్.ఎస్.నాయుడు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రస్తుత పాలకులు సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలుపై కాలయాపన చేయడంతో పాటు కొత్తగా జీపీఎస్ పేరుతో సరికొత్త గందరగోళానికి తెరతీయడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పాటై 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

కమలాపురం : కమలాపురం 3వ వార్డు సచివాలయంతో పాటు గంగవరం సచివాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని కార్య క్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎంగా మళ్లీ జగనన్నే రావాలి

పులివెందుల రూరల్ : రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా మళ్లీ రావాలని జేసీఎస్ పట్టణ కన్వీనర్ పార్నపల్లె కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందడం తథ్యమన్నారు. కులమతాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత

కడప స్పోర్ట్స్: విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో జాతీయ స్థాయిలో రాణిస్తున్న వాలీబాల్ క్రీడాకారిణులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రీడాపాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఖాదర్‌వలి, కోశాధికారి సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ అక్టోబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కడప క్రీడాకారిణులు కె.తులసి, టి.పావని, వి.కుసుమ ప్రియ, ఎస్.హేమశ్రీ, ఎన్.గాయత్రి, జి.శ్రీలక్ష్మిలు చక్కగా రాణించారన్నారు. దీంతోపాటు టి.పావని, కుసుమప్రియ, ఎన్.గాయత్రిలు అండర్-17 నేషనల్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారిణులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, వాలీబాల్ శిక్షకుడు గౌస్‌బాషా, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సందడిగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఆదివారం కడప నగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో సందడిగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు రఫీ ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేసి పురుషుల దినోత్సవ నిర్వహణ పట్ల తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో ప్రభుత్వమే ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రఫీ, మిత్ర యోగా సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఆకాశవాణి విశ్రాంతి ఉద్యోగి నరసింహాచారితో కలిసి వారందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కొందరు మహిళా న్యాయవాదులు కూడా హాజరు కావడం విశేషం.

4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

ముద్దనూరు : 4వ తరగతి ఉద్యోగుల యూనియన్ ఎన్నికలు ఆదివారం ముద్దనూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ముద్దనూరు సమితి అధ్యక్షుడిగా అమీర్‌బాషా, కొండాపురం అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా కిషోర్‌కుమార్, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, సంయుక్త కార్యదర్శిగా కుమారి, కోశాధికారిగా లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యుడిగా రంగనాయకమ్మ, ఈసీ మెంబరుగా వైష్ణవి ఎన్నికైనట్లు 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌ప్రభుకుమార్ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాగర్‌కుమారి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం క్రిస్టియన్‌లేన్‌లోని అక్షయ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లాలోని నలుమూలల నుంచి దాదాపు 126 మంది మహిళలు తరలివచ్చి వైద్య సేవలు పొందారు. వారికి ప్రసూతి, గైనిక్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ ఎ.సాగర కుమారి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో సామాన్యులకు సైతం నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు వీలుగా స్త్రీల మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. మహిళలు తమ అనారోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత గైనకాలజిస్టులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జనరల్ సర్జన్ పొదిలి వినయ్ కుమార్, నిర్వాహకురాలు పి.మహిత, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి.విష్ణువర్ధన్, సఖి ఫౌండేషన్ రహమతున్నిసా, స్త్రీ శక్తి మహిళా మండలి సరస్వతి, వెంకటలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఈశ్వర్‌రెడ్డి, బాసట సేవా సంస్థ ప్రతినిధి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు ప్రశంసనీయం



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అందించిన సేవలు ప్రశంసనీయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చీకటి చార్లెస్ తెలిపారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె దేశ ప్రధానిగా అనేక సంస్కరణలు అమలు చేసి దేశ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. అనంతరం జిల్లా సేవాదళ్ మాజీ అధ్యక్షురాలు షేక్ గౌసియా, జిల్లా మహిళ అధ్యక్షురాలు శ్యామలమ్మ, కాంగ్రెస్ పార్టీ సమాచార హక్కు చట్టం విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి ఇందిరాగాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ పఠాన్ అలీ ఖాన్, కొప్పూరి శ్రీనివాసులు, లావణ్య, పి.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో ఆదివారం వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి ధైర్యసాహసాలు నేటి తరం మహిళలకు ఆదర్శనీయమన్నారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షుడు సాయికుమార్, మధు, జనార్ధనరెడ్డి, విజయరాజు, హరికథా భాగవతార్ రమణయ్య భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం చేసింది

ప్రొద్దుటూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయక తీరని ద్రోహం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, ఫెడరల్ వ్యవస్థ, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని అన్నారు. తెలంగాణాలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణాజలాల పంపిణీలో ఏపీకి ద్రోహం చేస్తోందని తెలిపారు. ఎగువన ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు తుంగభద్ర, కృష్ణా నీటిని తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాయలసీమ నీటి అవసరాల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బీజేపీని రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీలు మోస్తున్నాయన్నారు. పార్టీ ఫిరాయింపులను చాపకింద నీరులా ప్రేరేపిస్తూ ఈ మూడు పార్టీలను మింగడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని, అక్కడి స్థానిక ప్రాంతీయ పార్టీలను ఇలాగే మింగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు ముంతాజ్, సర్వేశ్వరి, రమేష్, ఓబులేసు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యువత

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు సచివాలయం వెనుక వైపు రామాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆదివారం ఇందిరమ్మ కాలనీ రామాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆ కాలనీ యువత పర్యవేక్షణలో ఆలయ నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్చారణలతో భూమి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, ఆసక్తి ఉన్న దాతలు ఆర్థిక సాయం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కాలనీ యూత్ రాజశేఖర్, సోమశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కెవ్యాలీ ట్రిబుల్‌ఐటీలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఆదివా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా సమితి కో ఆర్డినేటర్ మధుసుదన్ మాట్లాడుతూ ఈలాంటి అవగాహన సదస్సుల వల్ల విద్యార్థుల్లో జాతీయ సమైక్యత వాదం ఏర్పడుతుందన్నారు. అలాగే సమాజం పట్ల గౌరవం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్ర మంలో ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్ తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



నూతన ఆలయంలో ప్రతిష్టించిన ఉమామహేశ్వరుడి విగ్రహం, పూజల్లో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కార్యనిర్వాహకులు తిరుమలశెట్టి మహేష్ ఆధ్వర్యంలో వైభవంగా విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో కళ్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తులను గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

మైదుకూరు : శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఉపకులాల ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న యుద్ధభేరి మహాసభ కరపత్రాలను ఆదివారం మైదుకూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు.

శిల్పారామంలో జోరుగా.. హుషారుగా



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపులో భాగంగా స్థానిక పాఠశాల చిన్నారుల ప్రదర్శనలు జోరుగా, హుషారుగా సాగాయి. నగరానికి చెందిన ఇండస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు చిన్నారులు హుషారుగా ఆడిపాడి సందర్శకులను ఆకట్టుకున్నారు. సందర్శకులు తమ కరతాళ ధ్వనులతో చిన్నారులను ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.